# నేడు ఓట్ల కౌంటింగ్

- 14 టేబుల్స్.. 23 రౌండ్లలో లెక్కింపు
- నేటితో ఉత్కంఠకు తెర

గజ్వేల్, డిసెంబర్ 2 : నేటితో సర్వత్రా ఉత్కంఠకు తెర పడనుంది. గత నెల 30న జరిగిన సాధారణ ఎన్నికల ఫలితాలు నేడు ఆదివారం వెలువడనున్నాయి. సిద్దిపేటలోని ఇందూర్ ఇంజినీరింగ్ కళాశాలలో గజ్వేల్ అసెంబ్లీ స్థానానికి సంబంధించిన కౌంటింగ్ ప్రక్రియ ఉదయం 8 గంటలకు ప్రారంభంకానుంది. అధికారులు 14 టేబుల్స్ ఏర్పాటు చేయగా, 23 రౌండ్లలో 321 బూత్‌కు సంబంధించిన ఓట్లను లెక్కించనున్నారు. గజ్వేల్ పరిధిలో మొదటగా తూప్రాన్ మండలం నాగులపల్లి బూత్ నుంచి లెక్కింపు ప్రారంభమై చివరలో జగదేవ్‌పూర్ మండలం దౌలాపూర్‌తో ఓట్ల లెక్కింపు ముగుస్తుంది. ఇప్పటికే సంబంధిత గ్రామాల కౌంటింగ్ ఏజెంట్లకు పాస్‌లను ఆర్వో జారీ చేశారు. ఆయా గ్రామాల్లో ఫలితాల కోసం ఉత్కంఠతో ఇరు పార్టీల నాయకులు ఎదురు చూస్తున్నారు. మధ్యాహ్నం లోపు ఫలితాలు వెలువడే అవకాశాలున్నాయి.

**బెట్టింగ్‌ల జోరు..**

గజ్వేల్‌లో గెలిచే పార్టీదే అధికారం అంటూ బెట్టింగ్‌ల జోరు కొనసాగుతున్నది. ఇప్పటికే కేసీఆర్ మెజార్టీపై చాలా వరకు గ్రామాల్లో యువకులు, పార్టీ కార్యకర్తలు బెట్టింగ్‌లు పెట్టినట్లు సమాచారం. గజ్వేల్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి కేసీఆర్ గెలుపొందితే తప్పకుండా రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలో ఉంటుందనేది ఇక్కడి ప్రజల నమ్మకం. ఇప్పటివరకు గజ్వేల్‌లో గెలుపొందిన రాజకీయ పార్టీయే రాష్ట్రంలో అధికారంలో ఉందని చెప్పొచ్చు.

### ఇందూరు ఇంజినీరింగ్ కాలేజీలో ఎన్నికల కౌంటింగ్

సిద్దిపేట, డిసెంబర్ 2 : సిద్దిపేట శివారులోని ఇందూరు ఇంజినీరింగ్ కాలేజీలో నేడు ఓట్లను లెక్కించనున్నారు. ఆదివారం ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం కానున్నది. సిద్దిపేట నియోజకవర్గానికి చెందిన ఓట్లను కాలేజీలోని డి-బ్లాక్‌లో లెక్కించనున్నారు. నియోజకవర్గంలో మొత్తం 2,33,733 మంది ఓటర్లు ఉండగా, అందులో పురుషులు 1,15, 546 మంది ఉండగా, మహిళా ఓటర్లు 1,18,317 మంది ఉన్నారు. ఇతరులు 70 మంది ఓటర్లు ఉండగా, ఇందులో పురుషులు 88673 మంది, మహిళలు 98710 మంది, ఇతర ఓటర్లు 37 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 2,33,370 మంది ఓటర్లకు 1,78,420 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 1,78,420 ఓట్ల లెక్కింపు కోసం 14 టేబుళ్లను ఏర్పాటు చేశారు. 20 రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తి చేయనున్నారు. ఇందుకోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.



అంజన్నకు ప్రత్యేక పూజలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

### బీఆర్ఎస్ ప్రభుత్వం రావాలని పూజలు

చిన్నకోడూర్, డిసెంబర్ 2 : బీఆర్ఎస్ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి రావాలని కోరుతూ శనివారం అల్లీపూర్ గ్రామంలోని హనుమాన్ ఆలయంలో బీఆర్ఎస్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి హరీశ్‌రావుకు లక్ష న్నర మెజార్టీ రావాలని, బీఆర్ఎస్ మళ్లీ అధికారం చేపట్టాలని అంజన్నను కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు, సర్పంచ్ చంద్రశేఖర్, ఉపసర్పంచ్ రాజాబాయ్, రైతుబంధు సమితి అధ్యక్షుడు మల్లయ్య, బీఆర్ఎస్వీ గ్రామ అధ్యక్షుడు బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఎటు చూసినా.. గెలిచేది సారే!

వర్గల్, డిసెంబర్ 2 : సీఎం కేసీఆర్ గజ్వేల్ రాజకీయ ప్రస్థానంపై ఓ వీరాభిమాని సారు.. ఆరు.. కారు.. సర్కారు అనే సంఖ్యలపై వినూత్న లెక్కలు వేశారు. వర్గల్ మండలం నెంటూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మాదిరెడ్డి రాఘవరెడ్డి 6 సంఖ్యపై ఇలా విశ్లేషణ జరిపి కేసీఆర్ గెలుపుపై బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం నింపారు. కేసీఆర్ వయసు 69,(6+9=15) 1+5=6, ఇలా కేసీఆర్ యాగం చేసింది 1221 మంది పంతుళ్లతో 1+2+1+2=6, గజ్వేల్ నియోజకవర్గం అసెంబ్లీ సంఖ్య 42, 4+2=6, ఆంగ్లంలో గజ్వేల్‌కు కూడా 6 అక్షరాలే ఉన్నాయి. గజ్వేల్ నియోజకవర్గంలో మొత్తం మండలాలు 8 కాగా, వీటిలో కూడా ఆరు అక్షరాలే వస్తాయి. తెలుగు అక్షరాల్లో మనోహరాబాద్, జగదేవ్‌పూర్, కుకునూర్‌పల్లి ఉన్నాయి. తెలంగాణలో 33 జిల్లాలు 3+3=6, నియోజకవర్గంలో పోలింగ్ బూత్‌ల సంఖ్య 231 కాగా, 3+2+1=6, ఇలా పలు అంశాల్లో రాఘవరెడ్డి చేసిన అంకెల గారడి బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ నింపుతున్నది.

### మృతుడి కుటుంబానికి పరామర్శ



మృతుడి కుటుంబాన్ని ఓదార్చుతున్న బక్కి వెంకటయ్య

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి) డిసెంబర్ 2 : అక్బర్‌పేట-భూంపల్లి మండలం భూంపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి రామచంద్రం(45) ఇటీవల కరెంట్ షాక్‌తో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య శనివారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట ఉప సర్పంచ్ ప్రభాకర్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు నరేశ్, చంద్రం, రాజు ఉన్నారు.

### నూతన వధూవరులకు ఆశీర్వాదం

రాయపోల్, నవంబర్ 2 : బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరశర్మ తమ్ముడు శివప్రసాద్‌శర్మ దంపతుల రిసెప్షన్ వేడుకలు శనివారం మండల కేంద్రంలోని జీవీఆర్ గార్డెన్‌లో జరిగింది. ఈ వేడుకకు ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్ హుస్సేన్, జిల్లా కో-ఆప్షన్ సభ్యుడు రహీముద్దీన్, గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మామిడి మోహన్‌రెడ్డి, బక్కి వెంకటయ్య, జడ్పీటీసీ యాదగిరి, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు రేకుల నర్సింహారెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారి వెంట జిల్లా కమిటీ సభ్యుడు రంగారెడ్డి, రాష్ట్ర యువజన నాయకులు రాజిరెడ్డి, ఇప్ప దయాకర్, మాజీ ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు వెంకటనర్సింహారెడ్డి, నాయకులు ఉన్నారు.



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమెల్సీ యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్ హుస్సేన్, నాయకులు

## తెలంగాణలో వచ్చేది బీఆర్ఎస్ సర్కారే



ధర్మపురి ఆలయంలో పూజలు చేస్తున్న బీఆర్ఎస్, బీఆర్ఎస్వీ నాయకులు

సిద్దిపేట, డిసెంబర్ 2 : తెలంగాణలో మళ్లీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ సర్కారు ఏర్పాటు కావాలని కోరుతూ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మెరుగు మహేశ్ నేతృత్వంలో శనివారం కొండగట్టు ఆంజనేయస్వామి, ధర్మపురి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం సాధిస్తుందన్నారు. సిద్దిపేటలో మంత్రి హరీశ్‌రావు అత్యధిక మెజార్టీ రావాలని కోరుతూ ప్రత్యేక పూజలు నిర్వహించామని తెలిపారు. దశాబ్దాల తెలంగాణ కలను నెరవేర్చి, దేశంలో ఎక్కడాలేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. దేవాలయాలను పునరుద్ధరించి దీపధూప నైవేద్యాలతో వెలుగులు నింపిన కేసీఆర్‌కు శ్రీరామాంజనేయ, వెంకట, లక్ష్మీనరసింహస్వామి వారి ఆశీస్సులు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి యాదగిరి, నియోజకవర్గ సమన్వయకర్త నార్లపురం రామ్మోహన్, రాచకొండ భిక్షపతి, పట్టణ సమన్వయకర్త ఇరుగంటి రమేశ్, నంగునూర్ మండల అధ్యక్షుడు గోవిందారం రవి, సిద్దిపేట మండలం అధ్యక్షుడు బండి శ్రీకాంత్, నారాయణరావుపేట మండల అధ్యక్షుడు ఆకుల సతీష్, అర్బన్ మండల అధ్యక్షుడు కోడెల నరేశ్‌యాదవ్, రూరల్ మండల బీసీ అధ్యక్షుడు శేఖర్, అప్పల శేఖర్ యాదవ్ పాల్గొన్నారు.

## దివ్యాంగులపై వివక్ష తగదు

**అడిషనల్ జడ్జి మురళీమోహన్**

సిద్దిపేట టౌన్, డిసెంబర్ 2 : దివ్యాంగులపై వివక్షత తగదని.. వారిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వాలు చట్టాలను రూపొందించాని సిద్దిపేట జిల్లా అడిషనల్ సెషన్స్ జడ్జి మురళీమోహన్ అన్నారు. దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం స్థానిక ఎన్జీవోస్ భవన్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జడ్జి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ చట్టం దృష్టిలో అందరూ సమానమే అని చెప్పారు. ప్రభుత్వం దివ్యాంగుల కోసం కార్యాలయాలు, ఆలయాల్లో ప్రత్యేకంగా ర్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. దివ్యాంగులపై ఎవరైనా దాడి చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. దివ్యాంగులకు న్యాయసేవాధికార సంస్థ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి మిలింద్ కాంబ్లే, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, శ్రీకర్‌రెడ్డి, వెంకటేశ్, దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అడిషనల్ జడ్జి మురళీమోహన్

### ఓటుకు పట్టం కట్టిన గ్రామాలు

వర్గల్, డిసెంబర్ 2 : మండలంలోని పలు గ్రామాలు గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 90 శాతంకు పైగా ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలోని జెబ్బాపూర్ గ్రామంలో అత్యధికంగా 96.18 పోలింగ్ శాతం నమోదు కావడంతో మొదటిస్థానంతో నిలిచింది. తున్కిమక్తలో 95.05 శాతంతో ద్వితీయ స్థానంలో నిలిచింది. శేరిపల్లి, మక్తమైలారం, గిర్మాపూర్, గోవిందాపూర్, అంబార్‌పేట, సీతారాంపల్లి, మీనాజిపేట, తున్కిఖల్సా గ్రామాల్లో 90కి పైగా పోలింగ్ శాతం నమోదైనట్లు వర్గల్ రిటర్నింగ్ అధికారి తెలిపారు.

### స్వపరిపాలన దినోత్సవం

సిద్దిపేట కమాన్, డిసెంబర్ 2 : పట్టణంలోని భారత్‌నగర్ వివేకానంద పాఠశాలలో ఘనంగా స్వపరిపాలన దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భాస్కర్‌రెడ్డి, కరస్పాండెంట్ లిఖిత, మహిళా ఉపాధ్యాయులు వాణిశ్రీ, రత్నమాల, జరీన, శిరీష, శ్రీవాణి, మనూష, అరుణ, భారతి పాల్గొన్నారు.

### విద్యుత్ ఏఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలి

అక్కన్నపేట, డిసెంబర్ 2 : అక్కన్నపేట మండలానికి సంబంధించి విద్యుత్ ఏఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు. మండల కేంద్రంలో ఇప్పటికే ఎంపీడీవో, తహసీల్దార్, పోలీస్‌స్టేషన్, వ్యవసాయశాఖ, ఎంఈవో, ఐకేపీ ఇతర మండల స్థాయి కార్యాలయాలు కొనసాగుతున్నాయి. కానీ, ప్రభుత్వ నిబంధనల ప్రకారం మండల కేంద్రంలో ఏఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది. విద్యుత్ అధికారులు కార్యాలయాన్ని ఏర్పాటు చేయకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. నిత్యం విద్యుత్ సరఫరా, ఇతరత్రా పనులపై అధికారులను సంప్రదించేందుకు హుస్నాబాద్ ఏడీఈ కార్యాలయానికి వెళ్లాల్సి వస్తుంది. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు స్పందించి మండల కేంద్రంలో విద్యుత్ ఏఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

## ఐకమత్యంతోనే గ్రామాభివృద్ధి

నంగునూరు, డిసెంబర్ 2 : అందరూ ఐకమత్యంగా ఉంటేనే గ్రామాభివృద్ధి సాధ్యమని ఎల్లంకి ఇంజినీరింగ్ సంస్థల చైర్మన్ ఎల్లంకి సదాశివరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని పాలమాకుల గ్రామానికి చెందిన ఎల్లంకి మాధవరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారులు సదాశివరెడ్డి, సాంబశివరెడ్డి, దయాకర్‌రెడ్డి రూ.10 లక్షల విలువైన వైకుంఠ రథం, బాడీ ఫ్రీజర్‌ను సర్పంచ్ కుమారస్వామికి అందజేశారు. ఈ సందర్భంగా సదాశివరెడ్డి మాట్లాడుతూ పుట్టిన ఊరుకు సహాయం చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఎంత ఎదిగినా కొంత గ్రామాభివృద్ధి, ప్రజలకు ఉపయోగపడే పనులు చేసినప్పుడే సార్థకత చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సారయ్య, మాజీ సర్పంచ్ రవీందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ ఓజాలు, నాయకులు పరమేశ్వర్, వేణుచక్రవర్తి, ఐలయ్య, శ్రీనివాస్, నరేశ్, లక్ష్మణ్, అశోక్, రవి, మల్లేశం, నారాయణ పాల్గొన్నారు.



వైకుంఠ రథం, బాడీ ఫ్రీజర్‌ను అందజేస్తున్న మాధవరెడ్డి కుమారులు